


చేవెళ్లలో అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- నూతన బిల్డింగ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్
- అధిక ఆదాయాన్నిచ్చే చోట్ల తొలి విడతలోనే నిర్మాణాలు
- కార్పొరేట్ తరహాలో ఆఫీసులు.. సొంత భవనాల ఆధునీకీకరణ
- చాలాచోట్ల అరకొర వసతులతో అద్దె భవనాల్లో కార్యాలయాలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు.. మహర్దశ

త్వరలోనే ఆఫీసులకు సొంత భవనాలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు మోక్షం కలగనుంది. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అధునాతన హంగులతో నూతన భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పనుల కోసం ఆఫీసులకొచ్చే వారికి కేఫ్‌టేరియాలు, వెయిటింగ్ లాంజ్‌లు తదితర వసతులతో కార్పొరేట్ ఆఫీసుల తరహాలో ఈ బిల్డింగ్‌లను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. సర్కారుకు భారీగా ఆదాయం తెచ్చే రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను తొలి విడతలో నిర్మించనున్నారు. ఎక్కువ ఆదాయం వచ్చే జిల్లాలకు తక్కువ ఆదాయం వచ్చే జిల్లాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేయనున్నారు. రిజిస్ట్రేషన్లకు కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి.


వికారాబాద్‌లోఅద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/మేడ్చల్, జూన్ 23 : ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చిపెట్టడంలో రిజిస్ట్రేషన్ శాఖ ముందు వరుసలో ఉంటుంది. కానీ.. అలాంటి శాఖకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సొంత భవనాల్లేవు. అయితే త్వరలో ఆ శాఖ కార్యాలయాలకు మంచి రోజులు రానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలనీ, అదుకోసం స్థలాలు సేకరించాలని, ఇప్పటికే సొంత భవనాలుంటే వాటినీ కార్పొరేట్ స్థాయిలో ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాల స్థానంలో కార్పొరేట్ కార్యాలయాలను తలదన్నే రీతిలో అధునాతన భవనాలను నిర్మించనున్నారు. రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి. వీటిలో 38 మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వాటిల్లో జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కూడా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. డిస్ట్రిక్ట్ సబ్ రిజిస్ట్రార్ పరిధి 22 కార్యాలయాల్లో రంగారెడ్డి జిల్లాలో 18, వికారాబాద్ జిల్లాలో నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ సబ్ రిజిస్ట్రార్ మినహా మిగతా అన్ని చోట్లా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతోన్నాయి. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లకు వచ్చే వారు కూర్చునేందుకు వీలు లేకుండా ఉండటంతో చెట్ల కింద, నీడ ఉన్న చోట సర్దుకుపోతున్నారు. ఈ కార్యాలయాలు కూడా సీజన్లలో కిక్కిరిస్తున్నాయి. కనీసం అక్కడ కూర్చునే పరిస్థితి కూడా లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు గంటల తరబడి కార్యాలయంలో నిలబడే ఉండాల్సి వస్తోంది. ఇకపై ఇలాంటి పరిస్థితి లేకుండా ఉండేందుకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు నూతన భవనాలను నిర్మించేందుకు తెలంగాణ సర్కార్ సంకల్పించింది. భూములు సిద్ధంగా ఉన్నచోట వీలైనంత త్వరగా మోడల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు సరిపడే స్థలాలను అన్వేషిస్తున్నారు. మొదటి దశలో ఆదాయం ఎక్కువగా వస్తున్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.


షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించేందుకు కేటాయించిన స్థలం

జిల్లాలపై స్పెషల్ ఫోకస్!

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాపై సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. నగరానికి ఆనుకొని ఉండటం, ఎక్కువగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరగడం, ఎప్పటికప్పుడు పెద్ద పెద్ద వెంచర్లు ఏర్పాటు అవుతుండటంతో సర్కార్ ఈ రెండు జిల్లాలపై ప్రత్యేక నజర్ పెట్టింది. రంగారెడ్డి జిల్లాలోని 18, మేడ్చల్ జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునిక హంగులతో నిర్మించేందుకు ప్లాన్ చేసింది. స్థల పరిశీలన చేయాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు సైతం ఆదేశాలు అందాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ముందంజలో ఉన్నాయి.

అరకొర వసతులతో ఏళ్లుగా అద్దె భవనాల్లో...

నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాల్లేవు. అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నిత్యం లక్షల్లో ఆదాయం వస్తున్నా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక తిప్పలు పడుతున్నారు. కలెక్టరేట్, ఔటర్ రింగ్‌రోడ్డు, ఫార్మాసిటీ, వంటి ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు అవుతుండటంతో ఇక్కడ భూములకు భారీగా డిమాండ్ ఉంది. దీంతో స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు భారీగా జరుగుతున్నాయి. అద్దె భవనంలో సరైన తాగునీటి వసతి, మూత్రశాలలు లేక కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు.

నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా..

చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించేందుకు కోర్టు పక్కనున్న స్థలాన్ని కేటాయించారు. పదేళ్ల క్రితం రూ.62లక్షలు మంజూరు చేశారు. భవనం నిర్మించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో నిధులు మళ్లిపోయాయి. కార్యాలయం ప్రస్తుతం అయ్యప్ప స్వామి ఆలయం పక్కన అద్దె భవనంలో కొనసాగుతోంది. కనీస సౌకర్యాలు లేవు. క్రయ విక్రయాలు జరిపేందుకు వచ్చిన వారికి తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు లేవు. ప్రజలు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. షాద్‌నగర్‌లోని నాగులపల్లి రోడ్డులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి 2019లో ప్రభుత్వం 10గుంటల భూమిని కేటాయించింది. దీనికి అప్పటి హోం మంత్రి మహమూద్ అలీ శంకుస్థాపన చేశారు. కానీ నేటి వరకు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్ట లేదు. ప్రస్తుతం ఈ స్థలం సమీపంలో ఉన్న ఫంక్షన్ హాల్‌కు పార్కింగ్ స్థలంగా మారింది. రాజేంద్రనగర్‌కు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 1996లో మంజూరైంది. తాత్కాలికంగా అంటూ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించారు. అయితే ఈ స్థలం వివాదంలో ఉంది. ఓ ప్రజాప్రతిధి అడ్డుకోవడంతో భవన నిర్మాణానికి నోచుకోవడం లేదు. అలాగే శంకర్‌పల్లి, గండిపేట్, ఫరూక్‌నగర్, చంపాపేట్, పెద్ద అంబర్‌పేట్, వనస్థలిపురం, సరూర్‌నగర్, శంషాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్, వికారాబాద్, పరిగి, తాండూరుల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు, అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇదీ పరిస్థితి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాలుండగా వాటిల్లో నాలుగు మాత్రమే సొంత భవనాలు కలిగి ఉన్నాయి. మిగిలిన కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి ప్రతి నెలా నెలా రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తున్నారు. అద్దె భవనాల్లో కొనసాగే కార్యాలయాలకు ఇచ్చే క్రయవిక్రయ దారులు, ప్రజలు నిల్చునేందుకు కూడా కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వసతుల్లేవు. ఇబ్బందులు ఎదురవుతున్నా తప్పని పరిస్థితుల్లో ఆ భవనాల్లోనే కార్యాలయాలను కొనసాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే స్థలాలు చూసినప్పటికీ భవన నింర్మాణాలకు అవసరమైన నిధులు లేక ప్రక్రియ నిలిచిపోయింది.




సీఎం రేవంత్‌రెడ్డికి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్‌పర్సన్లు అనితారెడ్డి, సునీతారెడ్డి

సీఎంను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్లు


సీఎంకు మొక్క బహూకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 23: రంగారెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్లు తీగల అనితాహరినాథ్‌రెడ్డి, పట్నం సునీతామహేందర్ రెడ్డిలు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. బొకే అందజేశారు. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా చైర్‌పర్సన్లు సీఎంను కోరారు. రూ2లక్షల రైతు రుణమాఫీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అంతే కాకుండా వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియామకమైన ప్రతీక్ జైన్ కూడా సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం వికారాబాద్ జిల్లా పరిధిలో ఉన్న నేపథ్యంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూల మొక్క అందజేశారు. తనను వికారాబాద్ కలెక్టర్‌గా నియమించినందుకు ప్రతీక్ జైన్ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరే విధంగా కృషి చేయాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న సిరిపురం వాగు

ఉప్పొంగిన వాగు


మర్పల్లి, జూన్ 23: ఇరవై రోజులుగా వర్షాల జాడ లేకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తలేదని ఆందోళన చెందుతున్న తరుణంలో ఆదివారం కురిసిన వర్షం ఊరట కలిగించింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని పలు గ్రామాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురివడంతో రైతుల మోముల్లో చిరునవ్వు కనిపించింది. మండల పరిధిలోని సిరిపురం వాగు వరద నీటితో పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జూన్ 23 : నిరుద్యోగ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని నర్సింగ్ ఫంక్షన్ హాల్ లో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 70 కంపెనీల్లో 5000 ఉద్యోగాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ముందుగా జడ్పీ చైర్ పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజులరమేష్, ఎంపీపీ చంద్రకళ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డిలతో కలిసి స్పీకర్‌జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగ యువత కు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా మెగా జాబ్‌మేళాను నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే 30 వేల ఉద్యోగాలు కల్పించడం జరిగిందని, ఇంకా లక్షా70 వేల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో కడా ఆధ్వర్యంలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ముమ్మర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన పనులు చేయడంతో పాటు, 5 సంవత్సరాల్లో నిరుద్యోగ సమస్యను తీరుస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా ఎంతగానో దోదపడుతుందన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ యువత విద్యతో పాటు తమలోని ప్రతిభను కూడా మెరుగుపరచుకోవాలన్నారు. యువత ఉద్యోగాలను పొంది తమ కుటుంబాలకు భరోసాగా ఉండాలన్నారు. అనంతరం జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు స్పీకర్ ప్రసాద్ కుమార్ నియామక పత్రాలను అందజేశారు. మెగా జాబ్ మేళాలో ఉద్యోగుల ఎంపిక ప్రక్రియను నిర్వాహకులను సభాపతి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లిగ్యా నాయక్, అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, టీజీస్టెప్ మేనేజర్ వేణుగోపాల్‌రావు, జడ్పీ సీఈవో సుధీర్, డీవైఎస్‌వో హనుమంతరావు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



ప్రైవేటు పాఠశాలల్లో 'సీబీఎస్ఈ' దందా

- అనుమతులు లేకుండా కరికులమ్ పేరుతో మోసం
- సీబీఎస్ఈ పుస్తకాలంటూ పాఠశాలలే తయారీ
- పుస్తకాల ఖరీదే రూ.8వేల నుంచి 10వేలు!
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

వికారాబాద్, జూన్ 23 : ప్రైవేట్ పాఠశాలలు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నాయి. అనుమతుల్లేకుండా సీబీఎస్ఈ సిలబస్ బోధన అంటూ తల్లిదండ్రులను, విద్యార్థులను మోసం చేస్తున్నాయి. ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు, డ్రెస్సులు అమ్మొద్దని ఉన్న నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. స్కూళ్ల సమీపంలో షెడ్లలో పుస్తకాలు విక్రయిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పుస్తకాలు అమ్మకాన్ని విద్యార్థి సంఘాలు పట్టిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. కొన్ని రోజుల క్రితం వికారాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ఏబీవీపీ నాయకులు పుస్తకాలు పట్టుకుని సీజ్ చేయించినా మళ్లీ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. వికారాబాద్‌లోని హైదరాబాద్ ఎక్సలెన్స్ స్కూల్, తాండూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు మాత్రమే సీబీఎస్ఈ సిలబస్ అనుమతులున్నాయి. కానీ వికారాబాద్‌లోని సెయింట్ ఆంథోని పాఠశాల రెండేళ్లుగా సీబీఎస్ఈ పేరుతో వ్యాపారాన్ని సాగిస్తోంది. 30మంది విద్యార్థులతో సీబీఎస్ఈ సిలబస్ పేరిట క్లాస్‌రూం పెట్టి రూ.50వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. అలాగే స్టేట్ సిలబస్ పేరుతో మరో తరగతి గది పెట్టి రూ.20 వేల నుంచి 25వేలు తీసుకుంటున్నారు. పుస్తకాలు, డ్రెస్సులు వారే అమ్ముతున్నారు. తాజాగా వికారాబాద్‌లో శ్రీచైతన్య, ఆలోఖ్య, బచ్‌పన్, న్యూ నాగార్జున తదితర పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ పేరిట అడ్మిషన్లు తీసుకుంటున్నారు. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్‌లలో 50వరకు ప్రైవేట్ పాఠశాలల్లో ఈ దందా కొనసాగిస్తున్నారు.

క్యాష్ చేసుకుంటున్న విద్యార్థి సంఘాలు

దోపిడీపై కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల వద్ద తమ విద్యార్థి సంఘం గొడవచేయకుంటా ఉండాలంటే కొంత డబ్బు ఇవ్వాలని కొన్ని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రతీ విద్యార్థి సంఘానికి ఇంత డబ్బు ఇవ్వాలని నిర్ణయించి తీసుకుంటున్నాయి.. ఈ మధ్యనే ఓ సంఘం పాఠశాల నుంచి 15వేలు డిమాండ్ చేసింది. విద్యార్థుల సమస్యలపై పోరాడే సంఘాలే వసూళ్లు చేస్తుంటే ఇక న్యాయం ఎక్కడ జరుగుతుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలల నిర్వాహకులు అధికారులకు ముడుపులు ముట్టజెబుతున్నారు.

సీబీఎస్ఈ నిబంధనలు గాలికి

సీబీఎస్ఈ సిలబస్‌కు సంబంధించి ఉండాల్సిన నిబంధనలేవీ ఈ పాఠశాలలు పాటించడం లేదు. విశాల భవనం, పదో తరగతి, ఇంటర్ విద్య అందులోనే ఉండాలి. జాతీయ స్థాయి అనుమతులు ఉండాలి. అమనుతులు రాకుండానే సీబీఎస్ఈ అని చెప్పి పుస్తకాలను కూడా పాఠశాల వారే తయారు చేసి అమ్ముతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి టీచర్లను తెచ్చి మోసగిస్తున్నారు. ఇదంతా కళ్లముందే జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఫీజుల్లో భారీ తేడాలు

ఒక్కో స్కూల్‌లో ఒక్కో విధంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీకి రూ.20వేల నుంచి 30వేల వరకు ఫీజు తీసుకుంటున్నారు. పుస్తకాలకు రూ.4వేల నుంచి 6వేలు వసూలు చేస్తున్నారు. హైస్కూల్ తరగతులకు 30వేల నుంచి 50వేలు తీసుకుంటున్నారు. పుస్తకాలకు 7వేల నుంచి 10వేలు తీసుకుంటున్నారు. సీబీఎస్ఈ పేరుతో 30శాతం ఫీజు అధికంగా తీసుకుంటున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో బడ్జెట్ పాఠశాలలు

జిల్లాలో ఏళ్లుగా నడుస్తున్న బడ్జెట్ పాఠశాలలు(చిన్న ప్రైవేటు స్కూళ్లు) ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. కార్పొరేట్ పాఠశాలల తక్కువ ఫీజులతో విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. అడ్మిషన్ల తర్వాత ఒకటే తరగతిని రెండు సెక్షన్లుగా విభజించి ఎక్కువ ఫీజు కట్టే వారికి ఒకరకంగా, తక్కువ ఫీజు చెల్లించే వారికి మరో రకంగా బోధిస్తున్నారు. అక్రమ దందాతో కార్పొరేట్ స్కూళ్ల దూసుకెళ్తుంటే బడ్జెట్ పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొంది.

ఎంఈవోలతో నోటీసులిస్తాం



జిల్లాలో సీబీఎస్ఈకి అనుమతులు లేవు. రెండు స్కూల్స్‌కు మాత్రమే ఉన్నాయి. మిగితా ఏ పాఠశాలైనా సీబీఎస్ఈ పేరుతో అడ్మిషన్లు తీసుకుంటే చర్యలు తప్పవు. పుస్తకాలు, స్కూలు డ్రెస్సులు అమ్మవద్దని ఆదేశాలు జారీ చేశాం. ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అన్ని మండలాలు, పట్టణాల్లో ఎంఈవోలతో స్కూళ్లను తనిఖీ చేయిస్తాం.

- రేణుకాదేవి, డీఈవో, వికారాబాద్

ప్రత్యేకాధికారులకే పగ్గాలు!

- స్థానిక సంస్థలన్నింటికీ వారే పాలకులు
- ఇప్పటికే జీపీలు.. ఇకపై మండల, జిల్లా పరిషత్‌లకు..!
- జూలై 4తో ముగియనున్న పాలక మండళ్ల గడువు
- జిల్లా స్థాయి అధికారులతో పరిపాలన
- నిధులు మాట దేవుడెరుగు.. నత్తనడకన అభివృద్ధి!



తాండూరు, జూన్ 23: మండల, జిల్లా పరిషత్తుకు ఎన్నికలు ఇప్పట్లో లేనట్టుగా సమాచారం. ఈ స్థానిక సంస్థలకు కూడా స్పెషలాఫీసర్ల(ప్రత్యేకాధికారులు) పాలన తప్పేటట్లు లేదు. మండల, జిల్లా పరిషత్‌ల పాలక మండళ్ల గడువు జూలై 4తో ముగియనుంది. ఇంకా సరిగ్గా 11 రోజుల గడువే మిగిలి ఉంది. ఈనెల 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగినా స్థానిక సంస్థల ఎన్నికల అంశం చర్చకు రాలేదు. దాంతో ఎన్నికలు ఇప్పట్లో లేనట్లేనని తేలిపోయింది. స్థానిక సంస్థల్లో ముఖ్యమైన గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వెంటనే ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించిన విషయం విధితమే. ఇక జిల్లా, మండల పరిషత్ ఛైర్మన్ల పదవి కాలం ముగియనుంది. అయితే, వారిని యథావిధిగా కొనసాగిస్తారా? లేక ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగిస్తారా? అనే విషయమై జోరుగా చర్చ కొనసాగుతోంది. మండల స్థాయిలో గ్రామం యూనిట్‌గా ఎంపీటీసీ, మండల యూనిట్‌గా జడ్పీటీసీలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికలు నిర్వహించాలంటే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుతో పాటు 45 రోజుల గడువు ఉండాలి. సమయం అంతలేదనేమో.. మరోవైపు రిజర్వేషన్ల ప్రక్రియ సంబంధించి పీటముడి ఏర్పడింది.

కులగణనకు బీసీ సంఘాల పట్టు!

కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ప్రక్రియ చేపట్టాలని, అప్పటి వరకు ఎన్నికలు నిర్వహించవద్దని బీసీ సంఘాలు, వివిధ ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం గత ఎన్నికలు జరిగినప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగాలనే నియమం ఉంది. ప్రస్తుతం రిజర్వేషన్లు చేసేందుకు వీలులేదని అధికారులు పేర్కొంటున్నారు. చట్ట సవరణ లేదా కులగణన చేపట్టాక రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టేందుకు అవకాశముందని చెబుతున్నారు. దాంతో ఎన్నికల నిర్వహణకు అనిశ్చితి ఏర్పాడింది. వీటన్నింటినీ పరిశీలించాక ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని, ఇంకా సమయం పడుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

అధికార పార్టీకి అనుకూలించేలా?

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా కులగణన చేపట్టనుంది. ఈమేరకు ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో చేపట్టారు. ఎన్నికల హామీని అమలు చేయడంతో పాటు మరింత సమయం తీసుకొని ఆరు గ్యారంటీలు, ఇతర సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్తుందని అధికార పార్టీ వర్గాల అంచనా. క్షేత్రస్థాయిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను ఎక్కువ స్థానాల్లో గెలుపొంది పట్టు సాధించాలని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థలలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే ఎక్కువగా ఉన్న విషయం విధితమే. అక్టోబర్ వరకు ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయమై వేచి చూసే అవకాశముంది.

తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో..

తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో జరిగిన ఎన్నికలలో తాండూరు, బషీరాబాద్, కోట్‌పల్లి మండలాలు బీఆర్ఎస్ ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకోగా.. పెద్దేముల్ మండలాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ప్రస్తుతం తాండూరు, బషీరాబాద్, కోట్‌పల్లి మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. పెద్దేముల్ మండలాధ్యక్షురాలు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లగా.. జడ్పీటీసీ మాత్రం కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు.

నిధులు రావడం కష్టమే!

స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంటు.. ఎన్నికలు నిర్వహించకుంటే నిలిచిపోయే అవకాశముంది. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు ఉపాధిహామీ పథకం నిధులు మండల, గ్రామ పంచాయతీలు వస్తున్నాయి. రాబోయే 16వ ఆర్థిక సంఘం నిధులు ఎన్నికలు సకాలంలో జరగకపోతే కేంద్రం నుంచి గ్రాంట్స్ రావటం ఆగిపోతాయని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లా అధికారులే స్పెషలాఫీసర్లు

మండలాలకు ప్రత్యేకాధికారుల పాలన తీసుకొని వస్తే.. జిల్లా స్థాయిఅధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారు. జిల్లా స్థాయిలోని అన్ని శాఖల అధికారులను నియమించనున్నారు. ఇప్పటికే పథకాల అమలు కోసం జిల్లాస్థాయి అధికారులు మండల, మున్సిపల్ ప్రత్యేకాధికారులుగా కొనసాగుతున్నారు. వారినే కొనసాగిస్తారా? లేక ఏమైనా మార్పులు జరుగుతాయా వేచి చూడాలి.

అన్నదాతకు ఆసరాగా కాంగ్రెస్ ప్రభుత్వం

- రుణమాఫీపై మాట నిలబెట్టుకున్న సీఎం
- సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జూన్ 23 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికలకు ముందు వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని 39లక్షల మంది రైతులకు ఏకకాలంలో రూ. 31వేల కోట్ల రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ చేయనుండటం గమనార్హమన్నారు. ఒక్కో రైతుకు ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ కానుండటంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో రైతుల కష్టాలను చూసే.. సీఎం రేవంత్ ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రుణమాఫీ కింద రూ. 13వేల కోట్లు వడ్డీ రూపంలో చెల్లించి రుణమాఫీ చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు బాబర్‌ఖాన్, బాలరాజుగౌడ్, ఇబ్రహీం, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న లెఫ్ట్‌నెంట్

మొయినాబాద్ రూరల్, జూన్ 23 : చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామిని ఆర్మీ లెఫ్ట్‌నెంట్ ప్రీతిపాల్‌సింగ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు సీఎస్.రంగరాజన్ ఘనస్వాగతం పలికి స్వామివారి దర్శనాన్ని కల్పించారు. అనంతరం ఆలయ వైశిష్ట్యాన్ని ఆయనకు వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.



చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద లెఫ్టినెంట్ గవర్నర్ ప్రీతిపాల్‌సింగ్, కుటుంబ సభ్యులు


సభావత్ చందు నాయక్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

'జేఈఈ అడ్వాన్స్‌డ్'లో మెరిసిన గిరిజన విద్యార్థి

శంకర్‌పల్లి, జూన్ 23 : మోకిల తండాకు చెందిన సభావత్ చందు నాయక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో సత్తా చాటాడు. ఎన్‌టీఏ ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో ఆల్ ఇండియాలో 91 మార్కులతో 407 (ఎస్టీ కేటగిరీ) ర్యాంకు సాధించాడు. యూసఫ్‌గూడలోని గురుకుల పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నాడు. కూకట్‌పల్లిలోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేశాడు. ఇందులో 966 మార్కులు సాధించాడు. తండ్రి శంకర్ సెంట్రింగ్ పనిచేస్తుండగా, తల్లి దేవి వ్యవసాయ కూలీ. తమ బిడ్డ మంచి ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు శంకర్, దేవిలు న్యాయవాది రవిలు ఆదివారం స్వీట్ తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. ఐఐటీలో సివిల్ ఇంజనీరింగ్ చేసి ఉన్నతంగా ఎదగడమే ధ్యేయమని చందునాయక్ తెలిపాడు.


సీఎంకు వినతి పత్రం సమర్పిస్తున్న టీయూటీఎఫ్ నేతలు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

రంగారెడ్డి అర్బన్, జూన్ 23 : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మ పాటిమీది రఘు నందన్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన సీఎం రేవంత్ రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను నగరంలో కలిశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని, ఉపాధ్యాయ బదిలీలు ప్రమోషన్లకు సంబంధించిన పలు అంశాలపై సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లగా పదోన్నతులు, బదిలీల కొరకు నిరీక్షిస్తున్న ఉపాధ్యాయుల కలలను నెరవేర్చిన సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు రూ.16 లక్షలు మంజూరు


జడ్పీటీసీకి ప్రొసీడింగ్ అందిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

ఆమనగల్లు, జూన్ 23: మండలంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి జిల్లా పరిషత్ నిధుల రూ.16 లక్షలు మంజూరైనట్లు జిల్లా సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్, జడ్పీటీసీ అనురాధపత్యానాయక్ తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం అనురాధ పత్యానాయక్‌కు జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి ప్రొసీడింగ్‌లు అందజేశారు. పులిగోనిపల్లి, సీతారాంనగర్ తండాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5లక్షలు, మేడిగడ్డ తండాకు రూ.5లక్షలు, రాంనుంతల పెద్దతండాకు రూ.4 లక్షలు, కేస్యతండాకు రూ.లక్ష, శంకర్‌కొండ తండాకు రూ.లక్ష చొప్పున నిధులు కేటాయించినట్లు ఆమె వివరించారు. మరికొన్ని గ్రామాలు, తండాలలో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. ఆమనగల్లు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామని అనురాధ పేర్కొన్నారు.


కుక్కల దాడిలో మృతి చెందిన లేగ దూడలు(ఫైల్)

మెదక్‌పల్లిలో కుక్కల బెడద

- లేగదూడలపై దాడి.. ఆందోళన చెందుతున్న రైతులు
- వారం వ్యవధిలో 10 ఆవులు, దూడల మృత్యువాత

ఆమనగల్లు, జూన్ 23: మండలంలోని మెదక్‌పల్లి గ్రామంలో కుక్కల బెడద తీవ్రమైంది. పొలాల వద్ద లేగ దూడలపై దాడిచేస్తూ చంపేస్తున్నాయి. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చాలామంది రైతులు పాడిపరిశ్రమ ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న పశువుల కొట్టాలలో ఆవులు, దూడలను కట్టేసి వస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ రెడ్డికి చెందిన నాలుగు, ప్రతాప్‌రెడ్డికి చెందిన రెండు, బాల్‌రాజ్‌కు చెందిన రెండు, వెంకటయ్యకు చెందిన రెండు దూడలు, బక్కయ్యకు చెందిన ఒక లేగదూడ కుక్కల దాడిలో గాయపడి మృతిచెందాయి. రోజురోజుకూ కుక్కల దాడులు అధికమవుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి పాడి పరిశ్రమ చేపట్టిన రైతులు కుక్కల దాడుల మూలంగా లేగ దూడలు మృతి చెంది నష్టపోతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

డ్రైనేజీ లైన్ వేశారు.. రోడ్డు మరిచారు



మేడ్చల్ టౌన్, జూన్ 23: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు కిష్టాపూర్ వీకర్‌సెక్షన్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ వేయడానికి రోడ్డు తవ్వి వదిలేయడంతో స్థానిక ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ లైన్ కోసం సీసీరోడ్డు మధ్య తవ్వి పైప్‌లైన్ పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నప్పటికీ రోడ్డును మాత్రం తిరిగి నిర్మించడంలేదు. ఈ విషయం పట్ల స్థానిక ప్రజలు పలుమార్లు స్థానిక కౌన్సిలర్‌కు, మున్సిపల్ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావటంతో గుంతలమయంగా మారిన రోడ్డులో వర్షం నీరు ఆగి స్థానికులు రోడ్డుపై నడవని దయనీయ పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. నిధులులేని కారణంగా రోడ్డునిర్మాణం చేపట్టడం కష్టమని స్థానిక మున్సిపల్ అధికారులు చేతులెత్తేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత

- ఇన్‌చార్జి డాక్టర్‌తోనే నెట్టుకొస్తున్నవైనం
- నిధులు లేక ఇబ్బందులు!.. రోగుల అవస్థలు


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మాడ్గుల, జూన్ 23 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా వైద్యసిబ్బంది లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. మాడ్గుల పీహెచ్‌సీలో వైద్యాధికారి మోహన్ విధులు నిర్వహిస్తున్నారు. అయితే, ఆయన మండల పరిధిలోని కొల్కులపల్లి దవాఖానలో కూడా ఇన్‌చార్జి డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మాడ్గుల దవాఖానలో సిబ్బంది లేక నానా అవస్థలు పడుతున్నట్లు ఆయన తెలిపారు. కాగా, ఒక డాక్టర్, స్టాఫ్ నర్స్ ఇద్దరికి ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారని, ఫార్మాసిస్ట్, డాటా ఎంట్రీ ఆపరేటర్, వాచ్‌మ్యాన్, అసిస్టెంట్లు లేరని ఆయన చెప్పారు. అదనంగా మరో డాక్టర్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సరిపడా సిబ్బందిని నియమించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు డాక్టర్ మోహన్ తెలిపారు. కాగా, మండలంలో 6 ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయని, ఆరుగురు డాక్టర్లకు ముగ్గురు మాత్రమే ఉన్నారని చెప్పారు. అయితే, ఉపకేంద్రాలకు సరైన బిల్డింగులు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కేవలం కొల్కులపల్లి ఉపకేంద్రానికి మాత్రమే సొంత భవనం ఉందని, మిగతా సెంటర్లు గ్రామపంచాయతీ భవనాల్లోనే కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. కాగా, మూడేళ్లుగా పీహెచ్‌సీకి సంబంధించిన అభివృద్ధి పనుల బిల్లులు మంజూరు కాలేదని తెలిపారు. విద్యుత్ లైట్ల ఏర్పాటు, వాటర్‌ట్యాంకులు, ఫ్యాన్‌ల మరమ్మతులు దాతల సాయంతో చేయించామని తెలిపారు. కాగా, పీహెచ్‌సీకి రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి అంబులెన్స్‌ను అందజేశారు. డ్రైవర్ లేకపోవడంతో అది మూలనపడిందని మండల ప్రజలు వాపోతున్నారు. ఆరోగ్య కేంద్రంలో అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలని, సిబ్బంది నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జమకాని గ్యాస్ సబ్సిడీ!

'మహాలక్ష్మి' లబ్ధిదారుల ఆందోళన
బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు



చేవెళ్ల, జూన్ 22 : రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారందరికీ రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ప్రకటించింది. అయితే, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ లబ్ధిదారులకు వంటగ్యాస్ సబ్సిడీ రావడం లేదు. దాంతో లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన హామీపై నమ్మకం కోల్పోయే పరిస్థితి నెలకొంది. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి రాయితీపై సిలిండర్ అందజేయాలని గ్యాస్ ఏజెన్సీలకు ప్రభుత్వం ఆదేశాలు సైతం జారీ చేసింది. దాంతో అర్హులైన వారు ఏజెన్సీల నుంచి సిలిండర్లు పొందుతున్నారు. ఇందులో చాలామంది బ్యాంకు ఖాతాల్లో మహాలక్ష్మి పథకం రాయితీ జమ కావడం కావడంలేదని వాపోతున్నారు. లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, గ్రామ పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు జమకాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులను అడిగితే ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. ఇప్పటివరకు కేంద్రం నుంచి వస్తున్న సబ్సిడీ రూ.40. 70 పైసలు యథావిధిగా వస్తుందని పేర్కొన్నారు.

డేటా అప్‌డేట్ చేసుకున్నా అందని రాయితీ

మహాలక్ష్మి పథకం కింద అర్హులైన వారి ఎంపిక కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను స్వీకరించింది. సబ్సిడీ సిలిండర్ కోసం పెద్దసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని ప్రభుత్వం ప్రజాపాలన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేయించింది. అయితే, ఆ సమయంలో ఆపరేటర్లు వివరాలను సరిగా నమోదు చేయకపోవడం, లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్, ఆధార్ వివరాలు సరిగా అందించకపోవడంతో చాలా మంది ఈ పథకం కింద లబ్ధి పొందలేకపోయారనే ఆరోపణలున్నాయి. దీన్ని గుర్తించిన ప్రభుత్వం అలాంటివారి వివరాలు సరిచేసుకునేందుకు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల వద్దకు వెళ్లి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసి సరి చేసుకున్నారు. అయినప్పటికీ వేలాది మందికి రాయితీ జమకావడం లేదని వాపోతున్నారు.

సవరణలకు నో ఛాన్స్..

ప్రజాపాలన కింద కొత్తగా దరఖాస్తు చేసుకుందామని భావించిన వారికి ప్రస్తుతం నిరాశే ఎదురవుతోంది. ప్రజాపాలన వెబ్‌సైట్‌ను జనవరి 6 తర్వాత నిలిపివేసిన ప్రభుత్వం.. తిరిగి తెరువలేదు. ఫలితంగా కొత్త దరఖాస్తుల స్వీకరణకే పరిమితమవుతున్నారే తప్ప.. వాటిని ఆన్‌లైన్ చేసే అవకాశం లేకుండా పోతోంది. అలాగే దరఖాస్తు సమయంలో తప్పుగా నమోదైన వివరాలు సైతం సరిచేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ కారణాలతో చాలామంది ప్రయోజనం పొందలేకపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సబ్సిడీ రావడం లేదు



మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత రెండు సార్లు వంట గ్యాస్ సిలిండర్లు తీసుకున్నా. అయితే నా బ్యాంకు ఖాతాలో మాత్రం ప్రభుత్వం ప్రకటించిన రాయితీ డబ్బు జమకాలేదు. గ్యాస్ ఏజెన్సీతో పాటు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించినా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు.

- ఎం.సరిత, గృహిణి, కమ్మెట, చేవెళ్ల మండలం

సిలిండర్‌పై రాయితీ చెల్లించాలి



రెండు నెలలుగా వంటగ్యాస్ సిలిండర్లు తీసుకున్నప్పటికీ బ్యాంకు ఖాతాలో సబ్సిడీ జమకాలేదు. బ్యాంకులో సంప్రదించగా ప్రజాపాలన దరఖాస్తు కేంద్రంలో వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో అప్‌డేట్ చేసి రెండు నెలలవుతున్నా ఇప్పటికీ రాయితీ జమ కాలేదు.

- వడ్ల వాణి, గృహిణి, మల్కాపూర్, చేవెళ్ల మండలం


మంత్రి కృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొజ్జ సాయిరెడ్డి

మంత్రి జూపల్లిని కలిసిన విజయ డెయిరీ చైర్మన్

ఆమనగల్లు, జూన్ 23: మాడ్గుల విజయ డెయిరీ చైర్మన్‌గా ఎన్నికైన కొల్కులపల్లి గ్రామానికి చెందిన బొజ్జ సాయిరెడ్డి ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, పాడిపరిశ్రమ సమాఖ్య ఎండీ లక్ష్మీలను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్ రెడ్డిలతో హైదరాబాద్‌లోని వారి కార్యాలయాల్లో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. చైర్మన్‌గా ఎన్నికైన సాయిరెడ్డిని వారు అభినందించారు. పాడిరైతులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చూడాలని మంత్రి, ఎమ్మెల్యే ఎండీలను కోరగా సానుకూలంగా స్పందించినట్లు సాయిరెడ్డి తెలిపారు.

మల్లు రవి ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ వెళ్లిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, జూన్ 23: మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంలో సంబురాలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకులు మండ్లి రాములు, గుర్రం కేశవులు, కాలే మల్లయ్య, పట్టణాధ్యక్షుడు మానయ్యల ఆధ్వర్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. నాయకులు గండికోట మల్లేశ్, నేనావత్ రవీందర్ నాయక్, జంతుక యాదయ్య, తదితరులు ఉన్నారు.

అద్దె గదిలోనే బోధన

శిథిలావస్థలో ధర్మాపూర్ ప్రాథమిక పాఠశాల

- మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపిక.. ముందుకు సాగని భవన నిర్మాణ పనులు
- డిప్యుటేషన్‌పై రెగ్యులర్ ఉపాధ్యాయుడు


శిథిలావస్థలో ఉన్న ధర్మాపూర్ ప్రాథమిక పాఠశాల

కొడంగల్ రూరల్, జూన్ 23 : ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం లక్షలాది రూపాయలు కేటాయిస్తోంది. నూతన పాఠశాలల భవనాలు, అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నా కొన్ని పాఠశాలలు దుస్థితిలోనే ఉన్నాయి. కొడంగల్ మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. దాంతో ఓ భవనం అద్దెకు తీసుకొని తరగతులు బోధిస్తున్నారు. గత ప్రభుత్వం మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కింద మండలంలోని 36 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించడంతో పనులు చేపట్టారు. ఒక్క ధర్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో మాత్రం పనుల ఊసేలేదు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో కూలేందుకు సిద్ధంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికీ అద్దె భవనంలోనే తరగతి గదులను కొనసాగిస్తున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. టేకుల్‌కోడ్ పాఠశాల ఉపాధ్యాయుడు ధర్మాపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే, గత సంవత్సరం 12మంది విద్యార్థులుండగా.. అందులో 6వ తరగతిలో చేరేందుకు ముగ్గురు ఇతర పాఠశాలలకు వెళ్లారు. ప్రస్తుతం 9 మంది విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇద్దరు విద్యార్థులు మొదటి తరగతిలో చేరినట్లు గ్రామస్థులు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని కూల్చివేసి నూతన భవనం, రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అద్దె గదిలో కొనసాగుతున్న తరగతులు


జెండాను ఆవిష్కరిస్తున్న జంగయ్య

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

షాబాద్, జూన్ 23 : కార్మికుల సమస్యల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలో హైతాబాద్ పారిశ్రామిక వాడలో ఏర్పాటుచేసిన ఏఐటీయూసీ నూతన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చాలా పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని వేలాదిగా కార్మికులు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఆ కార్మికులకు అండగా ఉండాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యాల దోపిడీకి వ్యతిరేకంగా ఏఐటీయూసి పోరాటాలు నిర్వహించాలని సూచించారు. అంతనర్రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికులకు చట్టబద్ధంగా 50శాతం జీతాలు ఎక్కువ ఇవ్వాల్సి ఉన్నా.. ఏ ఒక్క యాజమాన్యం అమలు చేయడం లేదన్నారు. కార్మికుల పొట్టలు కొట్టే పరిశ్రమ యాజమాన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామస్వామి, కార్యదర్శి సత్యానారాయణ, మండల కార్యదర్శి జంగయ్య, రఘురాం, మధు, మంజుల, రాములు, జాంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పాముల కాలం.. జరభద్రం

- వానాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం
- మూఢ నమ్మకాలతో ప్రాణాలకు ముప్పు
- వ్యవసాయ పనుల్లో రైతులు, కూలీలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



బషీరాబాద్, జూన్ 23: వానాకాలంలో పుట్టలు, పొదల్లోంచి పాములు, తేళ్లు ఇతర విష కీటకాలు తరుచూ బయటకొచ్చి మనుషుల పాలిట ప్రాణాంతకంగా మారతాయి. వ్యవసాయ పనుల్లో ఉంటే రైతులు, కూలీలు పాము కాటుకు గురై మృతిచెందిన సందర్భాలు అనేకమున్నాయి. పాము, తేలు కాటు వేసినప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది మంత్రాలు, చెట్ల మందులు వంటి మూఢనమ్మకాలను నమ్మి ప్రాణాల మీదికి తెచ్చుకుంటారు. ఎవరైనా పాము కాటుకు గురైతే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. పాము కరిచిన వ్యక్తి వీలైనంత తొందరగా ఆస్పత్రికి వెళ్తే వైద్యులు విషం విరుగుడుకు యాంటీ స్నేక్ వినమ్ ఇంజక్షన్ ఇస్తారు. చికిత్సతోనే పాము కాటు బాధితులు ప్రాణాలతో బయటపడతారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు పాములు, ఇతర కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ఇళ్లలో ధాన్యపు గాదెలు, పొదలు, పొలం గట్లు, చొప్ప కుప్పలు, గడ్డివాములు వంటి మొదలైన వాటిల్లో కప్పలు, ఎలుకలు తిరుగుతుంటాయి. ఆయా ప్రాంతాల్లో పాములకు ఆహారం సమృద్ధిగా ఉండటంతో అక్కడే సంచరిస్తుంటాయి. కొన్నిసార్లు వాటిలో గుడ్లు పెట్టి పిల్లలు చేస్తాయి. అలాంటి ప్రదేశాల్లో మనం జాగ్రత్తగా ఉండాలి. ఇళ్ల మధ్య, పరిసరాల్లో పొదలు లేకుండా చూసుకోవాలి. పొలంగట్లపై నడిచేటప్పుడు కట్టెలతో చప్పుడు చేసుకుంటూ నడవడం సురక్షితం. రాత్రివేళలో బయటకు వెళ్తే కచ్చితంగా టార్చిలైటు తీసుకుని వెళ్లాలి.

పాము ఎప్పుడు కాటేస్తుందంటే?

పొలం గట్లు, కాలువ గట్లు, పశువుల పాకలు, గుబురు ప్రదేశాలు, పొదలు, గడ్డివాములు, పాడుబడిన ఇళ్లు, కట్టెలు, పెంటదిబ్బల్లో పాములు తిష్టవేసి బల్లులు, తొండలను పట్టుకుని తింటాయి. పాములకు చెవులు వినపడనప్పటికీ వాటి శరీరం కింద భాగంగా ఉండే ప్రత్యేక పొలుసుల ద్వారా శబ్ద ప్రకంపనలను గ్రహిస్తాయి. వేడి ప్రవహించే జంతువులు, మనుషులు సమీపిస్తే వెంటనే గుర్తించి కాటేస్తాయి. ముఖ్యంగా పాములకు ప్రాణ భయం ఉన్నప్పుడు ఏకాంతానికి భంగం వాటిల్లినప్పుడు వాటిని తొక్కినప్పుడు, వేటాడినప్పుడు మాత్రమే అవికాటేస్తాయి.

పాములన్నీ విషపూరితం కావు

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. తాచు, కట్లపాము, నాగుపాము వంటి కొన్ని రకాల పాములు విషపూరితమైనవి. పాము కరిచినప్పుడు చాలా మంది భయానికి లోనై ప్రాణాలు కోల్పోతుంటారని వైద్యులు చెబుతుంటారు. కట్లపాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్తకణాల్లో కలుస్తుంది. ప్రమాద తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వెంటనే బాధితుడిని ఆస్పత్రిలో చేర్పించాలి. నాగుపాము కాటేసిన 15నిమిషాల్లోనే మనిషికి విషం ఎక్కుతుంది. ఆ లోపు ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలి. రక్త పింజర కాటేసిన రెండు గంటల్లోగా విషం ఎక్కుతుంది. జెర్రిపోతు, నీరుకట్ట కాటేసినా ఏమీకాదు. వాటికి విషం ఉండదు. అయితే కాటేసిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటే మంచిది. విషపూరిత పాము కాటేస్తే మనిషి శరీరం నీలంరంగులోకి మారుతుంది. రక్తపోటు ఎక్కువగా ఉంటే స్పృహ కోల్పోతారు. పాము కరిచిన చోట నొప్పి, వాపు ఉంటుంది. కొందరిలో పొక్కులు, దద్దుర్లు వస్తాయి. నోటి నుంచి నురుగ వస్తుంది.

పాము కరిచినప్పుడు ఆందోళన చెందవద్దు



పాము కరిచినప్పుడు బాధిత వ్యక్తి ఆందోళన చెందవద్దు. ఆసుపత్రిలో పాము కాటుకు సంబంధించిన యాంటీ స్నేకివీనమ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాము కరిచిన వెంటనే బాధితుడిని ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకురావాలి. చెట్ల మందులు, మంత్రాలు వంటివి నమ్మి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. ముఖ్యంగా వర్షాకాలం పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉంటూ పనులు చేసుకోవాలి.

- డాక్టర్.శ్రీకాంత్, బషీరాబాద్ పీహెచ్‌సీ వైద్యులు

ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూన్ 23: ఇచ్చిన మాటను నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ అని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తూ, ఆదివారం పరిగిలోని సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరంగల్‌లో జరిగిన సభలో రైతు రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏడాదికి రూ.6వేలు ఇస్తే, రాష్ట్రంలో ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ అమలు చేసిందని తెలిపారు. త్వరలోనే రైతు భరోసా కింద ఎకరాలకు రూ.7500ల నగదు సాయం అందించనున్నట్లు తెలిపారు. ఏడాదిలో రెండు దఫాలుగా ఇచ్చే రైతు భరోసాపై విధివిధానాలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. పూడూరులో రూ.2500కోట్లతో నేవీరాడార్ స్టేషన్‌ల పనుల ప్రారంభానికి త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దాంతి పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, డీసీసీ కార్యదర్శి ఎస్.రామకృష్ణ, నాయకులు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడికి సన్మానం



పకీరప్పను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కొడంగల్, జూన్ 23: టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టి.పకీరప్పను వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం రాత్రి కొడంగల్‌లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ కే.శివకుమార్‌గుప్త, పూరి శేఖర్, నారాయణ, వినోద్, హకీంబాలరాజ్, నరేందర్, బిచ్చప్ప, శంకర్‌లింగం, బాలరంగచారి తదితరులు కొడంగల్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టి.పకీరప్పను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

స్వదేశీ జాగరణ మంచ్ వికారాబాద్ జిల్లా కమిటీ నియామకం



స్వదేశీ స్వావలంబన రాష్ట్ర సభలో పాల్గొన్న జిల్లా బాధ్యులు

వికారాబాద్, జూన్ 23: స్వదేశీ స్వావలంబన రాష్ట్ర సభను హైదరాబాద్‌లోని కేశవ్ మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రముఖ్ జగదీశ్, తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్ ఈశ్వరీ జీ, విభాగ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటీని నియమించారు. జిల్లా కన్వీనర్‌గా భానురి మహేందర్‌రెడ్డి, జిల్లా మహిళా కన్వీనర్‌గా సుజాత, వికారాబాద్ జిల్లా కో కన్వీనర్‌గా కుర్వ వెంకటేశ్, వికారాబాద్ నియోజకవర్గ కన్వీనర్‌గా గౌండ్ల సురేష్ గౌడ్, పరిగి నియోజకవర్గ కన్వీనర్‌గా ఘనపురం భూపాల్ రెడ్డి వికారాబాద్ పట్టణ కన్వీనర్‌గా డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, నవాబుపేట మండల కన్వీనర్‌గా శ్యామ్ ముదిరాజ్, పూడూరు మండల కన్వీనర్‌గా ప్రేమ్ కుమార్‌లను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ.. సంస్థ స్వదేశీ వస్తు వినియోగం, స్వయం ఆవిష్కరణ, యువతను భావి భారతాన్ని పర్యావరణ పరిరక్షణ స్వయం సుస్థిరాభివృద్ధి వ్యాపార రంగంలో 'నేషన్ ఫస్ట్, స్వదేశీ మస్ట్' అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీహెచ్‌పీ బాధ్యులు ప్రశాంత్, విద్యాపీఠం బాధ్యులు కొండా వీరారెడ్డి, ప్రధాన ఆచార్యులు నర్సిములు, సంకేపల్లి మోహన్ రెడ్డి, సింగపూర్ రమేష్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా



ధారూరు: ఆకాంక్షకు చెక్కును అందజేస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, జూన్ 23: సీఎం సహాయనిధితో పేదలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ధారూరు గ్రామానికి చెందిన ఇంటర్ పూర్తిచేసిన దళిత విద్యార్థిని అకాంక్ష రెండు సంవత్సరాల కిందట కిడ్నీ సమస్యతో ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకుంది. ఆసుపత్రిలో మొత్తం రూ.2లక్షలు ఖర్చయింది. ఈ డబ్బుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో విద్యార్థిని ఆకాంక్ష సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ దరఖాస్తు సీఎం పేషీలో ఆమోదం లభించకపోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకాక ఆ కుటుంబం ఆర్థికంగా సతమతమవుతోంది. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు స్పీకర్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రసాద్‌కుమార్ చొరవచూపి సీఎం పేషీలో పెండింగ్‌లో ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించారు. విద్యార్థిని ఆకాంక్షను ఆమె తల్లిదండ్రులను వికారాబాద్ క్యాంపులోని ఆయన కార్యాలయానికి పిలిపించుకుని రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుజ్జయ్యగౌడ్, కిరణ్‌కుమార్, బాబాఖాన్, అశోక్ ముదిరాజ్, మల్లేశం, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బంట్వారం: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రూ.2.30లక్షల ఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీని అందజేశారు. బంట్వారం మండల కేంద్రానికి చెందిన కొండిగారి చెంద్రయ్య అనారోగ్యంతో హైదారాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన చికిత్సకోసం కుటుంబసభ్యులకు వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎల్‌వోసీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, సిద్దిరాములు, శ్రీనివాస్, నర్సింహులు, యాదగిరి, శంకర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



పరిగిలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, జూన్ 23: దేశం కోసం ప్రాణాలర్పించిన జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు పి.విక్రమ్‌రెడ్డి అన్నారు. డాక్టర్ శ్యామప్రసాద్ వర్థంతిని పురస్కరించుకుని ఆదివారం గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో నిర్వహించిన బలిదాన్ దివస్ కార్యక్రమానికి విక్రమ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్యామప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు త్రివర్ణ పతాకం దేశం చిహ్నంగా ఉండాలంటూ గళం విప్పిన గొప్ప దేశ భక్తుడన్నాడు. ఆయన చూసిన బాటలో నేటి యువతరం నడవాలన్నారు. ఎల్లంపేట గ్రామంలో నిర్వహించిన బలిదాన్ దివస్ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: భారతీయ జనతా సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్థంతిని పరిగిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో స్థానిక బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాంచందర్, ఉపాధ్యక్షుడు రాముయాదవ్, జిల్లా కార్యదర్శి పెంటయ్య, నాయకులు టీవీ నర్సింహులు, బాలకిష్టారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న కురుమ సంఘం నాయకులు

తాండూరు, జూన్ 23: కురుమ సామాజికవర్గానికి చెందిన బీర్ల ఐలయ్యకు కేంద్ర కేబినెట్‌లో మంత్రి పదవి ఇవ్వాలని తాండూరులో కురుమ యాదవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. 40లక్షల జనాభా ఉన్న కురుమ సామాజికవర్గానికి మంత్రి పదవి ఇవ్వడం న్యాయమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య కురుమ త్యాగాలను గుర్తించి కురుమలను మంత్రి వర్గంలో తీసుకోవాలని కోరారు. నీతికి, నిజాయితీకి మారుపేరైన కురుమలు అంతే నిబద్ధతతో పనిచేస్తారని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కురుమలు ముఖ్య భూమిక పోషించారని అన్నారు. ఆలేరు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిచిన బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కురుమల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో తాండూరు నియోజకవర్గం కురుమ సంఘం నాయకులు నాగారం జగదీశ్వర్, పూజారి పాండు, గౌడి వెంకటేశం, ఇందూరు మల్లేశం పాల్గొన్నారు.

మెట్లదారిలో ర్యాంపులు ఏర్పాటు చేయాలి



పాంబండపై గల మెట్లదారి

కులకచర్ల, జూన్ 23: కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పాంబండ దేవాలయానికి వెళ్లే మెట్ల దారిలో రెండు వైపులా ర్యాంపులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. మెట్లదారికి ర్యాంపులు లేకపోవడంతో కింద పడి కాలినడకన వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్రీ రామలింగేశ్వరస్వామి దర్శనం కోసం మెట్లదారిలో వెళ్లాలన్నా, కిందికి రావాలన్నా భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. రెండు వైపులా పట్టుకోవడానికి ర్యాంపులు లేకపోవడంతో భక్తులు కిందపడిన సంఘటనలు ఉన్నాయి. రెండు పర్వయాలు జరిగే జాతర ఉత్సవాల ద్వారా లక్షల్లో ఆదాయం వస్తున్నా మెట్లకు ర్యాంపులు ఏర్పాటు చేయలేదని, ఇప్పటికైనా ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు స్పందించి మెట్లదారికి రెండు వైపులా ర్యాంపులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

లక్నో వెళ్లిన తాండూరు బీఎస్పీ నేతలు



లక్నోలో జరిగిన బీఎస్పీ జాతీయ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న బీఎస్పీ నేతలు

తాండూరు, జూన్ 23: లక్నోలో జరిగిన జాతీయ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ కేంద్ర కోఆర్డినేటర్ బాలయ్య, తాండూరుకి చెందిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్ర శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కులకచర్ల, జూన్ 23: మండలంలోని ఘనపూర్ గ్రామ సక్రియ నాయక్ తండాలో శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం నిర్మాణానికి ఎంపీటీసీ తనయుడు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఘనపూర్ గ్రామ సక్రియనాయక్ తండాలో శ్రీవీరాంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఎంపీటీసీ వెంకటమ్మ కుమారుడు వార్ల వెంకట్ తనవంతుగా ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్జి కృష్ణయ్య, గణేశ్, సక్రనాయక్, చంద్రనాయక్, హనుమంతు, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సక్రియ నాయక్ తండాలో ఆలయ నిర్మాణానికి విరాళాన్ని అందజేస్తున్న ఎంపీటీసీ తనయుడు

ఇందిరమ్మ విగ్రహానికి తొలగని ముసుగు



ముసుగులో ఇందిరాగాంధీ విగ్రహం

మేడ్చల్ టౌన్, జూన్ 23: పార్లమెంట్ ఎన్నికల కోడ్ సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని సంతోషిమాత చౌరస్తా వద్ద ఉన్న మాజీ ప్రధాని ఇందిరాగాధీ విగ్రహానికి ముసుగు వేశారు. అయితే ఎన్నికల కోడ్ ముగిసినా ఇంతవరకు ముసుగు తొలగించకపోవడంపై కాంగ్రెస్ అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కాంగ్రెస్ నేతలు గాని, అధికారులు గానీవేసిన ముసుగును వేసినట్లే ఉంచడం శోచనీయమని స్థానికులు అంటున్నారు.

మేడ్చల్ కురుమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మేడ్చల్ కుర్మసంఘం సభ్యులు

మేడ్చల్ టౌన్, జూన్ 23: మేడ్చల్ పట్టణ కురుమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌర్ల మధు కుర్మ, ఉపాధ్యక్షుడిగా ఒగ్గు సురేష్ కురుమ, ప్రధాన కార్యదర్శిగా కొడె శ్రీశైలం కురుమ, కోశాధికారిగా మైల బీరేందర్ కురుమ, జాయింట్ సెక్రటరీగా గుండ కణేష్ కురుమ, కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్, భాస్కర్, మహేష్, భూపాల్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొడె మహేష్ కురుమ, కుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై సర్వే



కులకచర్లలో సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

కులకచర్ల, జూన్ 23: మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఆదివారం కులకచర్ల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి సర్వే నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరఫరాలో ఇబ్బందులు, లీకేజీలు తదితర వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నీరు తక్కువగా వస్తుందని ఆయా కాలనీల ప్రజలు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి

మేడ్చల్ టౌన్, జూన్ 23: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎల్లంపేట శివార్లలో గల జాతా టీ కఫిన్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం సుమారు 60సంవత్సరాల వృద్ధుడిని గుర్తుతెలియని ఆటో ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా అతడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. వృద్ధుడి ఆచూకీ తెలియరాలేదని, మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీ నగర్‌లో చోరీ

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 23: ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో చోరీ జరిగింది. దుండగులు నగదు, ఇతర సామగ్రిని అపహరించుకెళ్లారు. ఘట్‌కేసర్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్ఎఫ్‌సీ నగర్ సీ-2 కాలనీలో రాజు మిశ్రాకు కాటన్ బాక్స్ హోల్‌సెల్ కార్యాలయం ఉంది. అందులో శనివారం అర్థరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు మెయిన్ డోర్ తాళం పగులగొట్టి కార్యాలయంలో ఉన్న రూ.10వేల నగదు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం స్థానికులు మెయిన్‌డోర్ తెరచి ఉండటాన్ని గమనించి యజమాని రాజు మిశ్రాకు సమాచారం అందించారు. వెంటనే తన కార్యాలయానికి చేరుకున్న రాజు మిశ్రా పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫాంహౌస్‌పై దాడి.. నలుగురు అరెస్ట్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 23: స్థానికులకు ఇబ్బంది కలిగించేలా, నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫాంహౌస్‌పై దాడిచేసి నలుగురిని అరెస్ట్ చేసిన ఘటన ఆదివారం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్‌లోని శనివారం రాత్రి కాంటినెంట్ ఫాంహౌస్‌లో నియమ నిబంధనలకు విరుద్ధంగా హుక్కా సేవిస్తూ న్యూసెన్స్ సృష్టిస్తున్నారని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఫాంహౌస్‌పై దాడులు చేశారు. బర్కత్‌పురకు చెందిన ఫార్మా వ్యాపారి సౌరబ్ గుప్తా తన తల్లి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కాగా వేడుకల్లో నిబంధనలకు విరుద్ధంగా సౌరబ్ గుప్తా, నాగరాజు హుక్కా సేవించారు. వీరిద్దరితో పాటు, నిర్వాహకులు ఆకాశ్ గుప్తా, మేనేజర్ సరోజ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు పోలీసు అధికారులకు ఉత్తమ సేవా పతకాలు



అబ్దుల్ హఫీజ్, ఎస్ఐ



రాజశేఖర్, ఏఎస్ఐ

వికారాబాద్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలను ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్పెషల్ బ్రాంచ్(డీఎస్‌బీ)లో ఎస్ఐగా పనిచేస్తున్న అబ్దుల్ హఫీజ్‌కు, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ)లో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఎం.రాజశేఖర్‌కు ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. వీరికి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పతకాలను అందజేయనున్నారు. జిల్లా నుంచి పోలీసు సేవా పతకాలు సాధించిన ఈ అధికారులను ఎస్పీ కె.నారాయణరెడ్డి అభినందించారు. విధి నిర్వహణ సక్రమంగా నిర్వర్తించే వారికి ఎప్పుడైనా గుర్తింపు లభిస్తుందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

కోట్‌పల్లిలో తాగునీరు వృథా

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు





కోట్‌పల్లి మండల కేంద్రంలో రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

బంట్వారం (కోట్‌పల్లి) జూన్23: కోట్‌పల్లి మండల కేంద్రంలో పాలన పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఆదివారం ఉదయం నుంచి రోడ్డుపై వృథాగా నీరు పోవడంతో ప్రధానరోడ్డుపై నీరు ప్రవహించి బురదమయం కావడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీంతో రోజూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా ఒక్క అధికారి కూడా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

టీజీఐఐసీ జోనల్ మేనేజర్ మాధవి బదిలీ


- నూతన జోనల్ మేనేజర్‌గా అనురాధ నియామకం



బెల్లంకొండ మాధవి

జీడిమెట్ల, జూన్23 (ఆంధ్రజ్యోతి): టీజీఐఐసీ మేడ్చల్, సిద్దిపేట్ జోన్ జోనల్ మేనేజర్ బెల్లంకొండ మాధవి ఎట్టకేలకు బదిలీఅయ్యారు. ఎనిమిది సంవత్సరాలుగా జీడిమెట్ల టీజీఐఐసీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మాధవిని టీజీఐఐసీ ప్రధాన కార్యాలయంలో అసెస్ట్ మేనేజ్‌మెంట్ వింగ్‌కు జనరల్ మేనేజర్‌గా బదిలీచేశారు. అదేవిధంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ సీహెచ్.జ్యోతిని కరీంనగర్ జోనల్ మేనేజర్‌గా(ఎఫ్ఏసీ) బదిలీచేశారు. మేడ్చల్, సిద్దిపేట్ జోన్ జోనల్ మేనేజర్‌గా పటాన్‌చెరువులో జోనల్‌మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం.అనురాధను నియమించారు. సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. మాధవి ఎనిమిది సంవత్సరాలుగా ఒకే చోట పనిచేశారు. జీడిమెట్ల, శామీర్‌పేట్, మేడ్చల్ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో పనిచేసిన కొందరు ఉన్నతాధికారుల అండదండలతో మాధవి తన హవాకొనసాగించారనే ఆరోపణలు ఉన్నాయి.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషిచేయాలి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధులు

ఘట్‌కేసర్, జూన్23: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ ఉప్పల్ డివిజన్ ఉపాధ్యక్షుడు పసులాది చంద్రశేఖర్ అన్నారు. ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ సబ్బండ వర్గాల నాయకుడని కొనియాడారు. యువత ఉన్నత చదవులు చదవి దేశానికి కీర్తిప్రతిష్టలు సంపాదించిపెట్టాలని కోరారు. విద్యార్థులు విద్యతోపాటు సమాజంలో అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు మీసాల అరుణ్ కుమార్, భరత్, దాసు, శ్రీనివాస్, రాందాస్, రాజేష్, నర్సింగ్‌రావు, విజయ్, ప్రవీణ్, ఉదయ్. చరణ్, సంతోష్, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సమావేశానికి తరలి రావాలి

బొంరాస్‌పేట్, జూన్ 23: తెలంగాణ జానపద కళలను ఆదరిస్తూ కళాకారులను కాపాడేందుకు తెలంగాణ రాష్ట్ర జానపద సంఘం ఎంతో కృషి చేస్తుందని సంఘం వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని రేగడిమైలారం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. తమ సంఘం చేస్తున్న కృషిని వివరించారు. అందులో భాగంగా జులై 3న హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని తలపెట్టినట్లు తెలిపారు. సంఘానికి వెన్నంటి ఉంటున్న సారిపల్లి కొండల్‌రావుకు అదేరోజు సాయంత్రం రవీంద్రభారతిలో సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు కోలాటం, భజన బృందాలు తమను సంప్రదించాలని కోరారు.